# మాఘమాసం

డా. వి.యస్. శాస్త్రి

పండుగలు ఆయా జాతుల సంస్కార బిందువులు — సంస్కృతీ ప్రతిబింబాలు కూడాను. వాటి ఆంతరంగిక భావాన్ని నేటితరం పూర్తిగా గ్రహించవలసి వుంది. మన జాతీయ జీవనవిధానం లో కూడా పండుగలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. సమాజంలో స్నేహం, సంఘటిత శక్తి, దేశభక్తి, ఆధ్యాత్మిక భావనలను పెంపొందిస్తాయి.

హిందూ సాంప్రదాయం ప్రకారం ప్రతి మాసానికి ఓ విశిష్టత ఉంది. ప్రతిదీ పవిత్రమైనదే. ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేకత. చాంద్రమానం ప్రకారం పదకొండోది మాఘమాసం. కార్తీకంలో దీపానికి ఎంత ప్రాముఖ్యత ఉందో, మాఘమాసంలో స్నానానికి అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలోనే ఆ పరమేశ్వరుడు లింగ రూపంలో ఆవిర్భవించాడు. అలాగే జ్ఞానస్వరూపిణి సరస్వతి జన్మించింది కూడా మాఘ మాసంలోని వసంత పంచమి రోజునే. అంతే కాకుండా ఈ నెలలోనే ప్రత్యక్ష దైవమైన ఆ సూర్య భగవానుడు రథంపై సంచారానికి బయలు దేరుతాడని అంటారు. మాఘ మాసంలో పుణ్య స్నానాలకు ప్రాముఖ్యత ఉంది. మకర లగ్నంలో సూర్య భగవానుడు ఉండే సమయంలో చేసే స్నానాలకు విశేషం ఉంది. గంగా యమునా సంగమస్థలమున మాఘమాసమందు స్నానము చేయువారికి కోటి కల్పములకైనను జన్మబంధము ఉండదు. ఈ గంగానదిలో ఎక్కడ స్నానము చేసినను కురుక్షేత్ర సమానము. కాశీకంటే గంగాయమునాసంగమము నూరు రెట్లు పుణ్యప్రదమని యర్థము.

ఆ జలంలో హరి పరిపూర్ణుడై ఉండటంతో ఆయన కృపకు పాత్రులవుతారని పేర్కొన్నారు. ఈ మాసంలో వేకువజామునే లేచి స్నానం ఆచరించడం ప్రధానం. "దుఃఖ దారిద్ర్యనాశాయ శ్రీ విష్ణోస్తోషణాయచ, ప్రాతఃస్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశనం" అనే ఈ శ్లోకాన్ని పఠిస్తూ నదుల్లోగానీ, చెరువుల్లో గానీ, బావుల దగ్గర గానీ స్నానం చేయడం విశేషఫలదాయకం.

పై ప్రదేశాల్లో కుదరకపోతే కనీసం ఇంట్లో స్నానం చేస్తున్నప్పుడు, (గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతీ — నర్మదా సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు) అని గంగ, గోదావరి,

కావేరి లాంటి పుణ్య నదులను తలుచుకుంటూ స్నానం ఆచరించాలి. స్నానం చేసిన తర్వాత ఆలయానికి వెళ్లాలి. శివాలయంలో నువ్వుల నూనెతో దీపాలను వెలిగిస్తే దోష పరిహారం అవుతుంది. ఈ మాసంలో ఆదివారం నాడు సూర్య ఆరాధన ఎంతో ఉత్కృష్టమైంది. మాఘ మాసంలో సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి. ఉపనయనం అయినవారు మంత్రంతో అర్ఘ్యం ఇస్తారు.
ఉపనయం కాని వారు ప్రతి ఒక్కరూ సూర్యోదయ సమయంలో శుచిగా సూర్యుడి నామాలు చెబుతూ అర్ఘ్యం ఇచ్చుకోవాలి. కనీసం ప్రతి ఆదివారం తప్పనిసరిగా సూర్యోదయ సమయంలో సూర్యుడిని ఆదిత్య హృదయంతో పఠించడం వల్ల అనారోగ్యాలు నశిస్తాయనేది శాస్త్ర వచనం.
ఈ నెలలోని శుక్లపక్ష తదియనాడు బెల్లం, పప్పులను బ్రాహ్మణుడికి దానం ఇవ్వాలట. తిల పాత్ర దానము ముఖ్యము. హిరణ్యమక్కరలేదు. తిలలు మాత్రమే (తెల్లనివిగాని నల్లనివిగాని) రాగి పాత్రలో నుంచి, ''ఇదం తిలాపాత్రం యథాశక్తి హిరణ్య సహితం యమదైవతం బ్రహ్మలోకావాప్తి కామస్తుభ్య మహం సంప్రదదే'' యని యుచ్చరించుచూ దానము చేయవలెను. అలాగే సాలగ్రామ శిలా దానము శుభమైనది.
ఈ మాసంలో రథసప్తమితోపాటు శ్రీ పంచమి, వరచతుర్దశి, వరుణ షష్టి, భీష్మాష్టమి, భీష్మ ఏకాదశి, మాఘ పూర్ణిమ విశేషమైన రోజులు.